తిరుపతి - చిత్తూరు

30 ఏళ్ళ ప్రస్థానం వార్త 30 వార్షికోత్సవం 1996 - 2026

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## ఉద్యాన సమగ్ర అభివృద్ధిపై అక్టోబర్ 1న డ్రోన్ షై షో

### జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్



తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:
రాయలసీమ ఉద్యాన సమగ్ర అభివృద్ధి ప్రాజెక్టుపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న దని, జిల్లాలో ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించే దిశగా జిల్లాలో ప్రజలు, రైతులు, యువతకు అవగాహన కల్పించేలా పలు ప్రచార అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్ బుధవారం తెలిపారు. ఇందులో భాగంగా అక్టోబర్ 1వ తేదీ గురువారం రాత్రి 7 గంటలకు తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా ఉన్న నెహ్రూ మునిసిపల్ క్రీడా మైదానంలో ప్రత్యేకంగా డ్రోన్ షో కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు.

## సేవా సంకల్ప్ యాత్ర ప్రారంభం



తిరుపతి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:
ప్రధాని మోదీ ప్రజా సేవకు 25యేళ్ళు పూర్తికావడంతో తిరుపతి అలిపిరి వద్ద సేవాసంకల్పయాత్ర ప్రారంభమైంది. ఈ యాత్రను టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, తిరుపతి ఇన్‌ఛార్జి జెబి శ్రీనివాస్, పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి ృ, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యేలు శ్రీనివాసులు, నెలవల విజయశ్రీ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, పచ్చదనం సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్మన్ సుగుణమ్మ,ఎస్వీబిసి ఛైర్మన్ శ్రీధర్‌వర్మ, నేతలు పుష్పావతియాదవ్, కంకణాల రజనీకాంత్‌నాయుడు, దంపూరి భాస్కర్, ఆనంద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# జన సైనికులకే టోకరా!

**రూ.10 లక్షలు సబ్సిడీ రుణాలు ఇప్పిస్తామని కార్యకర్తల నుండి భారీ మొత్తంలో వసూళ్లు**
**ఈ వ్యవహారంలో జిడినెల్లూరు జనసేన నేత కీలకపాత్ర- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధిత జనసైనికులు**
**- ఎస్పీ ఆదేశాల మేరకు జిడినెల్లూరు ఇన్స్‌పెక్టర్ విచారణ**

చిత్తూరు, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:
ఎన్నికలు ఎప్పుడు వచ్చినా క్షేత్ర స్థాయిలో పార్టీ అధిష్టానం నిర్ణయించిన అభ్యర్థి విజయం కోసం ప్రత్యర్థి పార్టీ కార్యకర్తలతో ఘర్షణలకు సైతం సిద్ధమయ్యే జనసైనికులను జిడినెల్లూరు నియోజకవర్గ పరిధిలో ఆ పార్టీకి చెందిన కీలక నేత కుచ్చుటోపి పెట్టారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం జిడినెల్లూరు నియోజకవర్గ పరిధిలోని జనసేన కీలక నేతకు అధికారిక పదవి దక్కడంతో తన పార్టీకి చెందిన కార్యకర్తలను ఆ నేత ముగ్గులోకి దింపాడు. కేంద్ర ప్రభుత్వ పథకం పిఎంజిపివై ద్వారా ఒకొక్కరికి రూ.10 లక్షలకు తగ్గకుండా సబ్సిడీ రుణం మంజూరు చేస్తానని ఈ రుణం మంజూరు కావాలంటే ముందుగా రిజిస్ట్రేషన్ ఫీజు కింద కొంత మొత్తం చెల్లించాల్సి వుంటుందని కార్యకర్తలకు నమ్మబలికాడు. రాష్ట్రంలో అధికార కూటమిలో అధికారిక పదవి అనుభవిస్తున్న నేత స్వయంగా ఒకొక్క కార్యకర్తలకు రూ.10 లక్షల వరకు సబ్సిడీ రుణం ఇప్పిస్తానని చెప్పడంతో వారు ఈ మాటలను గుడ్డిగా నమ్మి రిజిస్ట్రేషన్ ఫీజు కింద కొంత మొత్తం చెల్లించారు. అయితే రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి నెలలు గడుస్తున్నప్పటికీ నియోజకవర్గ పరిధిలో ఏ ఒక్కరికి సబ్సిడీ రుణం మంజూరు కాకపోవడంతో నియోజకవర్గంలో జనసేన పార్టీ తరపున కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న నేతను నమ్మి తాము మోసపోయామని గ్రహించిన జనసేన కార్యకర్తలు పలుమార్లు తాము రిజిస్ట్రేషన్ ఫీజు కింద చెల్లించిన మొత్తంను తమకు చెల్లించాలని ఆ నేతను కోరారు. అయితే ఈ వ్యవహారం తనకు సంబంధించిన వ్యవహారం కాదని, తాను ఒకరిని నమ్మి అతని వద్ద రిజిస్ట్రేషన్ ఫీజు కింద డబ్బులు చెల్లించానని చెప్పడం జరిగిందని, అయితే తాను నమ్మిన వ్యక్తి అందరినీ మోసం చేశాడని, ఈ వ్యవహారంతో తనకు సంబంధం లేదని ఆ జనసేన నేత చేతులు దులుపుకున్నాడు. దీంతో మోసపోయిన జనసేన కార్యకర్తలు ఇటీవల కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి జిడినెల్లూరు నియోజకవర్గ జనసేన నేత, ప్రస్తుతం ప్రభుత్వ పదవిలో వున్న నేతపై ఫిర్యాదు చేశారు. జనసేన కార్యకర్తలు ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించిన కలెక్టర్ ఈ వ్యవహారంపై విచారించి చర్యలు తీసుకోవాలని ఎస్పీ తుషార్ దూడిని ఆదేశించారు. ఎస్పీ తుషార్ దూడి ఈ వ్యవహారంను సమగ్రంగా విచారించి తగు చర్యలు తీసుకోవాలని జిడినెల్లూరు సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌ను ఆదేశించారు. అయితే ఈ వ్యవహారంపై జిడినెల్లూరు పోలీసులు ఇంకా విచారణ ప్రారంభించనట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై పోలీసులు విచారణ ప్రారంభిస్తే జిడినెల్లూరు జనసేన కీలక నేతపై మరిన్ని ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చే అవకాశం వుండటంతో జిడినెల్లూరు పోలీసులు విచారణను వాయిదా వేస్తున్నట్లు సమాచారం. జిడినెల్లూరు నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లో ఒకొక్క మండలం నుండి సుమారు వంద మంది నుండి రెండు వందల మంది కార్యకర్తల వరకు జిడినెల్లూరు నియోజకవర్గ జనసేన కీలక నేత ఆధ్వర్యంలో సబ్సిడీ రుణాల మంజూరుకు రిజిస్ట్రేషన్ ఫీజుల కింద భారీ మొత్తంలో వసూళ్ళకు పాల్పడినట్లు జనసైనికులు పేర్కొంటున్నారు. రాజకీయంగా పలుకుబడి వున్న కొంత మంది నేతలు సాధారణంగా తమకు తెలిసిన వారి జోలికి వెళ్ళకుండా తెలియని వారి నుండి పెద్ద మొత్తాల్లో దండుకోవడం అనవాయితీ. అయితే జిడినెల్లూరు నియోజకవర్గంలో జనసేన పార్టీలోని కీలక నేతనే అదే జనసేన పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే కార్యకర్తలను నమ్మించి మోసం చేయడంతో తాము మోసపోయినట్లు ఎవరికి ఫిర్యాదు చేయాలని కొంతమంది జనసేన కార్యకర్తలు మదనపడుతున్నారు. మరోవైపు జిల్లాలో జనసేన పార్టీకి పెద్ద దిక్కుగా ఎవ్వరు లేకపోవడం, జిడినెల్లూరు నియోజకవర్గంలో జనసేన పార్టీకి కీలకంగా వున్న నేత ప్రభుత్వ పదవి సైతం అనుభవిస్తుండటంతో జనసేన పార్టీకి చెందిన అత్యధిక నాయకులు, కార్యకర్తలు కొన్ని పనుల కోసం ఈ నేతను సంప్రదించాల్సి రావడంతో ఈ నేత వారి నుండి సైతం భారీగా ముడుపులు తీసుకొంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ వ్యవహారంపై జనసేన పార్టీ అధిష్టానం దృష్టి సారించి సొంత పార్టీ కార్యకర్తలకు జరిగిన మోసంను గుర్తించి వారికి న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.

# విచారణా ఆద్యంతం రహస్యం...

## ఆలస్యంగా కమిటి నియామకం



విచారణకమిటి ముందు హాజరైన గైనకాలజిస్టు

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:
శ్రీకాళహస్తిలని ఏరియా ఆసుపత్రిలో జరిగిన అవకతవకలు, అవినీతి, ఎన్‌టిఆర్ ఆరోగ్య సేవా నిధులు దారి మళ్ళింపులకు సంబంధించి ఆలస్యంగా అయినా విచారణ ప్రారంభం అయ్యింది. బుధవారం కూడా విచారణ ఎంతో పకడ్బందీగా సాగింది. అయితే విచారణ జరుపుతుండగా రూ.3.25లక్షలు తన అకౌంట్‌లో రాగా దానిని తాను తిరిగి ఇచ్చేసానంటూ సుభాష్ జిల్లాకలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించటం గమనించదగ్గ విషయం. గతంలో ఇక్కడ పని చేసి ప్రస్తుతం పుత్తూరులో పని చేస్తున్న డాక్టర్‌ను కూడా బుధవారం రప్పించారు. మంగళవారం ప్రారంభించిన విచారణ బుధవారం మరింత పకడ్బందీగా ఆసుపత్రి సిబ్బందిని సైతం దగ్గరకు రాకుండా నిర్వహిస్తున్నారు.అయితే కమిటి ఆలస్యంగా నియమించటం,అలాగే వారం సమయం ఇవ్వటంతో తప్పిదాలకు సంబంధించి రికార్డులను సృష్టించుకున్నారు. పోలీసు కేసులో ఉన్న వారు లేకుండా కమిటి ఎవరిని విచారిస్తుందనేది చర్చనీయాంశంగా మారింది. శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో విచారణకు సంబంధించి గోప్యంగా ఉంచారు. అయితే 2021లో కంప్యూటర్ విభాగంలో లక్ష్మీ ప్రసన్న చేరినప్పటి నుంచి విచారణ ప్రారంభించారు.ఆసుపత్రి సూపరిం టెండెంట్లుగా పని చేసిన డాక్టర్ విజయలక్ష్మీ, మణి, ప్రస్తుత సూపరింటెండెంట్ మురళీ కృష్ణలతో విచారణ ప్రారంభించారు. విచారణ కమిటీలో డిసిహెచ్ డాక్టర్ ఆనందరావు,ఆడిట్ కమిటికి చెందిన సభ్యులు హాజరయ్యారు. మంగళవారం విచారణలో గతంలో ఇక్కడ పని చేసిన ఉద్యోగులు సురేష్,రేఖా,సునీల్‌లను విచారించినట్లు సమాచారం. ఆసుపత్రిలో అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టారు. ఈ అవకతవకలు బయటపడటానికి కారకులైన లక్ష్మీ ప్రసన్న, చందు,లక్ష్మణ్ సుభాష్‌లకు షోకాజ్ నోటీసు జారి చేయగా వారు తీసుకోలేదని తెలిసింది. వారందరూ గైరుహాజరైనట్లు సమాచారం.అయితే వీరిని పథకం ప్రకారం ఉన్నతాధికారి తప్పించుటకు ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. అయితే విచారణ కమిటి ఆ దిశగా పరిశీలిస్తుందా? లేదా? అనేది చర్చనీయాంశంగా మారింది.

## పోలేరమ్మ జాతరలో...
# సామాన్య భక్తులకే ప్రాధాన్యత
### ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



బాలాయపల్లి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:
పోలేరమ్మ జాతరలో సామాన్య భక్తులకు దర్శనం కల్పించేందుకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. పోలేరమ్మ అమ్మవారి జాతర సందర్భంగా 300 రూపాయలు, 100 రూపాయల టికెట్ల కౌంటర్‌ను ఎమ్మెల్యే రామకృష్ణ ప్రారంభించారు. విఐపి పాసులు ఎవరికీ ఇవ్వడం లేదని తెలిపారు. సామాన్య భక్తులు సంతోషంగా అందరూ దర్శనం చేసుకోవాలని తెలిపారు. 300 రూపాయలు టికెట్లను కొని అవసరమైన వారికి ఇస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేకంగా పూల అలంకరణ కూడా చేస్తున్నట్లు తెలిపారు. పోలేరమ్మ జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయం ట్రస్ట్ బోర్డు చైర్మన్ గొల్లగుంట మురళీకృష్ణ, ఈవో ఆర్వోభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు వెంకట ముని, దొంతు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**జాతర ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ**

జాతర ఏర్పాట్లను జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు పరిశీలించారు. పోలేరమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్లను పరిశీలించారు. అమ్మవారిని తయారు చేసే చాకలి వీధి, అమ్మవారి అలంకరణమాలతో, నిరూపణ మండ పాల ప్రాంతాలను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం చూడాలని ఏఎస్పి మనోహర్ ఆచారి, డిఎస్‌పి చెంచు బాబులను ఆదేశించారు.

# కల్పవృక్ష వాహనంపై గణపయ్య వైభవం

కాణిపాకం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:
కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం సిద్ధి,బుద్ధి సమేతుడైన గణపయ్య కోరిన వరాలిచ్చే కల్పవృక్షవాహనంపై కాణిపాకం పురవీధులలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఆలయంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల ప్రత్యేక ఉత్సవాలలో భాగంగా స్వామివారికి బుధవారం కల్పవృక్షవాహన సేవను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి దేవస్థానం కార్యనిర్వహణాధికారి, అర్చకులు మరియు ఆలయ సిబ్బంది ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు ఆలయ ఛైర్మన్ వి.మనినాయుడు,ఈఓ పెంచల కిషోర్‌ల ఆధ్వర్యంలో వారు ఉదయం మంగళవాయిద్యాల నడుమ వరుస ఉభయం తీసుకురాగా అర్చకస్వాములు స్వామివారి మూలవిరాట్‌కు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి చందనం, వెన్న పరిమళ పుష్పాలతో పాటు పలు రకాల ఏడు వారాల బంగారు ఆభరణాలతో దేదీప్యమానంగా అలంకరించి ప్రత్యేకపూజలు చేసి ధూపదీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే స్వామివారి ఉత్సవమూర్తులకు అలంకారమండపంలో అష్టోత్తర శతకలశ క్షీరాభిషేకంను నిర్వహించారు. తిరిగి రాత్రి అలంకార మండపంలో గణనాథుడు ఉభయదేవేరులతో కలసి కల్పవృక్ష వాహనంపై అధిరోహించి పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ మణినాయుడు,ఈఓ పెంచల కిషోర్, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, స్థానా చార్యులు పణికుమార్ శర్మ, ఏఈఓలు ధనపాల్, హరిమాధవరెడ్డి, రవీంద్రబాబు,ప్రసాద్, సూపరెండెం ట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలా జినాయుడు,రవిలతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు,అర్చకులు, వేదపండితులు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో విజయం లక్ష్యంగా వ్యూహాలు

### జిల్లా టిడిపి అధ్యక్షుడు షణ్ముగంరెడ్డి



చిత్తూరు, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:
స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ వ్యూహాలు రచించి అమలు చేయనుందని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెక్కుడుకుప్పం షణ్ముగంరెడ్డి అన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చెక్కుడుకుప్పం షణ్ముగంరెడ్డి అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెక్కుడుకుప్పం షణ్ముగంరెడ్డితో పాటు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్ చౌదరి తదితరులు పాల్గొన్నారు. షణ్ముగంరెడ్డి మాట్లా డుతూ స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చిన పార్టీ బలపరిచే అభ్యర్థుల విజయం సాధించేలా వ్యూహాలనుఅమలు చేయాలన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పని చేసి పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# పార్టీలు మారిన వారికి టిక్కెట్లు ఇవ్వం

## గెలిచే వారికి టిక్కెట్లు
## గంగమ్మ దర్శించుకున్న టిడిపి రాష్ట్ర నేత పల్లా



తిరుపతి,సెప్టెంబర్ 30ప్రభాతవార్త:
అవకాశవాదంతో పార్టీలు మారిన వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో టిక్కెట్లు ఇవ్వబోమని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన, గెలిచే అవకాశాలు ఉన్న వారికే టిక్కెట్లు ఇస్తామన్నారు. కూటమి పార్టీలలో ఎవరికి ఎక్కడ టిక్కెట్లు ఇవ్వాలనే విషయం కమిటీ నిర్ణయిస్తుందని చెప్పారు. తమకు 2029 ఎన్నికలు ముఖ్యం అన్నారు. దీనికోసం సర్వేలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బుధవారం ఉదయం తిరుపతి పర్యటనలో భాగంగా పల్లా శ్రీనివాసరావు తిరుపతి తాతయ్యగుంట గంగమ్మను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఛైర్మన్ మహేష్ యాదవ్, ఈఓ జయకుమార్ అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఇన్‌ఛార్జి జెబి శ్రీనివాస్, పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి ృ, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, ఎస్వీబీసీ ఛైర్మన్ శ్రీధర్ వర్మ, సత్యవేడు నియోజకవర్గం ఇన్చార్జి శంకర్ రెడ్డి,పుష్పావతియాదవ్, కంకణాల రజనీకాంత్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మానవ రూపంలో ఆరాధించే దేవుడు
# కల్కి భగవాన్ ఇక లేరు
### - శోకసంద్రంలో భక్తులు



వరదయ్యపాలెం, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త
భక్తులు మానవ రూపంలో దేవుడిగా ఆరాధించే శ్రీ కల్కి భగవాన్ ఇక లేరు అనే వార్త తెలియగానే దేశవ్యాప్తంగా భక్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ వార్త వినగానే దేశం నలు మూలల నుంచి భక్తులు వరదయ్యపాలెం మండలం, బత్తలవల్లం లోని ఏకం (న్థి) టెంపుల్‌కు భారీగా తరలివచ్చారు. గురువారం ఉదయం నుంచే ఆయన పార్థివదేహాన్ని దర్శించుకోవడానికి భక్తులు బారులుతీరారు. ఏకం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది.

**ప్రముఖుల సందర్శన..**

విషయం తెలుసుకున్న భారతీయ జనతా పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాసులు, తెలుగుదేశం పార్టీ సత్యవేడు నియోజకవర్గ కోఆర్డినేటర్ శంకర్‌రెడ్డి బుధవారం స్థానిక నాయకులతో కలిసి ఏకం టెంపుల్ కు చేరుకుని కల్కి భగవాన్ పార్థివ దేహాన్ని దర్శించుకుని నివాళులు అర్పించారు. స్థానిక ప్రజలు మాట్లాడుతూ కల్కి భగవాన్ 30 సంవత్సరాల క్రితం వరదయ్యపాలెం మండలంలో అడుగుపెట్టిన తర్వాతే ఈ ప్రాంతం, ఈ నియోజకవర్గం రాష్ట్రంలోనే అగ్రస్థాయికి చేరింది. ఆయన లేని లోటు తీరనిది అని ఆవేదన వ్యక్తం చేశారు.

**భారీ బందోబస్తు..**

భక్తుల రద్దీ దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు పర్యవేక్షణలో పోలీసు శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. ఏకం టెంపుల్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ప్రార్థదేహాన్ని దర్శించుకున్న వారిలో బిజెపి ఉపాధ్యక్షుడు నరేందర్ రెడ్డి, వరదయ్యపాలెం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, పి యుగంధర్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ పి నిర్మల్ కుమార్, బిజెపి వరదయ్యపాలెం మండల అధ్యక్షులు దిలీప్ రాయల్, యువ మోర్చా ఉపాధ్యక్షులు, అన్వేష్, ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు, మాజీ మండల అధ్యక్షులు వేలూరు పురుషోత్తం, బత్తులవలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుబ్బు, కన్నయ్య నాయుడు, హరి నాయుడు, కే వి బి పురం, తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మునస్వామి యాదవ్, వైసిపి సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ బొప్పన తిలక్ బాబు, గిరి రెడ్డి, ఉజ్వల్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# తిరుపతి ఆర్థిక ప్రాంత ప్రణాళిక 2047 పై క్షేత్రస్థాయి సూచనలు

**తిరుపతి ఎకనామిక్ రీజియన్ సి ఈ ఓ ముఖేష్ కుమార్ మీనా**




తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:
స్వర్ణాంధ్ర !! 2047 లక్ష ్య సాధనలో భాగంగా తిరుపతి ఎకనామిక్ రీజియన్ ప్రణాళిక-2047 రూపకల్పనకు క్షేత్రస్థాయి భాగస్వాముల సూచనలు, సలహాలు ఎంతో కీలకమని తిరుపతి ఎకనామిక్ రీజియన్ సి ఈ ఓ ముఖేష్ కుమార్ మీనా పేర్కొన్నారు. బుధవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ విసి హాల్ నందు తిరుపతి ఎకనామిక్ రీజియన్ సీఈఓ ముఖేష్ కుమార్ మీనా, ప్లానింగ్ శాఖ జాయింట్ సెక్రటరీ అనంత శంకర్, జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, చిత్తూరు, ఎస్ పి ఎస్ ఆర్ నెల్లూరు జిల్లాల కలెక్టర్లు సుమిత్ కుమార్, హిమాన్షు శుక్లా, ఎం.ఎల్ సి కంచర్ల శ్రీకాంత్, తిరుపతి, నగరి, సూళ్ళురుపేట, సత్యవేడు ఎం ఎల్ ఎ లు ఆరణి శ్రీనివాసులు, గాలి బాను ప్రకాష్, నెలవల విజయశ్రీ, ఆదిమూలం, నగరపాలక సంస్థ కమీషనర్ ఎం. జయకృష్ణలతో కలసి తిరుపతి ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి పై తిరుపతి, చిత్తూరు, ఎస్ పి ఎస్ ఆర్ నెల్లూరు జిల్లాల భాగస్వాముతో ఒక రోజు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో స్పెషల్ డిప్యూటి కలెక్టర్ శివ శంకర్ నాయక్, జిల్లా రెవిన్యూ అధికారి జి.నరసింహులు, సీపీఓ రాజశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సీనియర్ అధికారులు, పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు, నిపుణులు, కే పి ఎం జి ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. తిరుపతి ఎకనామిక్ రీజియన్ సీఈఓ మాట్లాడుతూ ప్రాంతీయ ఆర్థిక ప్రణాళికను కేవలం డేటా సేకరణ, నివేదిక తయారీగా కాకుండా ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు, సిటీ ప్లానర్లు, ప్రభుత్వ అధికారులు తదితర భాగస్వాముల ప్రత్యక్ష సూచనల ఆధారంగా రూపొందించాలనే ఉద్దేశంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్లానింగ్ శాఖ జాయింట్ సెక్రటరీ మాట్లాడుతూ తిరుపతి ఎకనామిక్ రీజియన్‌లోని తొమ్మిది జిల్లాల ప్రాథమిక సమాచారం, ఆర్థిక పరిస్థితులు, వృద్ధి అవకాశాలు, తలసరి ఆదాయ పరిస్థితులను మండల స్థాయి వరకు అధ్యయనం చేసినట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి ప్రాంతంలో సుమారు 15 వేల ఎకరాల విస్తీర్ణంలో పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ అందుబాటులో ఉందని తెలిపారు. ఇప్పటికే అనేక పరిశ్రమలు ఏర్పాటై ఉన్న నేపథ్యంలో పారిశ్రామిక అభివృద్ధికి అవసరమైన బలమైన రహదారి అనుసంధానాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. నెల్లూరు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నెల్లూరు, తిరుపతి, ప్రకాశం జిల్లాల్లో అభివృద్ధి చెందుతున్న పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను స్థానిక యువతకు అందించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. చిత్తూరు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అందుబాటులో ఉన్న భూమిని సమర్థవంతంగా వినియోగించుకుని పెట్టుబడులను ఆకర్షించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ టి ఈ ఆర్ ప్రాంతంలో పరిశ్రమలు, సేవా రంగాల్లో పెరుగుతున్న ఉపాధి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకునేలా కళాశాల స్థాయి నుంచే నైపుణ్యాలు, ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. 'తిరుపతి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తిరుమలతో పాటు శ్రీకాళహస్తి, కాణిపాకం వంటి పుణ్యక్షేత్రాలను అనుసంధానిస్తూ టెంపుల్ టూరిజం సర్క్యూట్ను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సూళ్లూరుపేట ఎం ఎల్ ఎ మాట్లాడుతూ ఇరకం ఐలాండ్, బీవీ పాలెం, పులికాట్ సరస్సు, ఫ్లెమింగో ఫెస్టివల్, శ్రీహరికోట వంటి ప్రాంతాల పర్యాటక సామర్థ్యాన్ని వివరించారు. సత్యవేడు ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో శ్రీ సిటీ సెజ్ తో పాటు సుమారు 300 పరిశ్రమలు ఉన్నప్పటికీ వాటికి అనుగుణంగా రహదారి, ఆరోగ్యం, విద్య, సామాజిక మౌలిక సదుపాయాలు మరింతగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. నగరి ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుపతి ఆర్థిక ప్రాంతం సమగ్ర అభివృద్ధిలో భాగంగా నగరి నియోజకవర్గంలో పారిశ్రామిక, సేవా, పర్యాటక రంగాల అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

# యువత విద్యతో పాటు కళల్లో భాగస్వామ్యం




**- జిల్లా యువజనోత్సవాలు-2026 కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు**

**చిత్తూరు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** యువత విద్యతో పాటు వివిధ సృజనాత్మకత, క్రీడలు, కళలు, సామాజిక బాధ్యత వంటి అంశాల్లో విస్తృతంగా పాల్గొని ముందడుగు వేసి సమాజాభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. చిత్తూరు నగరంలోని విజయం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బుధవారం యువజన సర్వీసుల శాఖ(సెట్విన్) ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు-2026 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి సుమారు 150 మంది యువతీ యువకులు పాల్గొని వివిధ కళావిభాగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మాట్లాడుతూ యువత తన ప్రతిభను సద్వినియోగం చేసుకుని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. సెట్విన్ సిఇఓ యశ్వంత్ మాట్లాడుతూ జిల్లా స్థాయి యువజనోత్సవాల ద్వారా యువతలోని విభిన్న ప్రతిభలను గుర్తించి వారికి మరిన్ని అవకాశాలు కల్పించడమే లక్ష్యమన్నారు. సెట్విన్ మేనేజర్ మోహన్‌కుమార్ మాట్లాడుతూ యువతలో దాగి వున్న ప్రతిభను గుర్తించి, వారికి సరైన వేదికలు కల్పించడమే యువజనోత్సవాల ప్రధాన ఉద్దేశమన్నారు. విజయం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎం.తేజోమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు, యువతలో దాగి వున్న ప్రతిభను వెలికితీయడానికి యువజనోత్సవాలు మంచి వేదికగా నిలుస్తోందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు యువతలో ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేస్తాయన్నారు. జిల్లా సహకార అధికారి లక్ష్మీ మట్లాడుతూ యువతకు నైపుణ్యాభివృద్ధి, స్వయం ఆధారితత, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించడం అవసరమన్నారు. యువత ప్రభుత్వ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తుకు బలమైన పునాదులు వేసుకోవాలన్నారు. జిల్లా సాంఘీక సంక్షేమశాఖ డిప్యుటీ డైరెక్టర్ రబ్బానీ భాషా మాట్లాడుతూ యువత సమాజంలో సానుకూల మార్పులకు ప్రతినిధులుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో విజయం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ డాక్టర్ గోపి, విజయం ఎంబిఎ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జయంత్, మై భారత్ ప్రోగ్రాం సూపర్‌వైజర్ శ్రీనివాసులు, సెట్విన్ సూపరిటెండెంట్ గణేష్, అకౌంటెంట్ నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ యువజనోత్సవాల్లో ఫోక్ డ్యాన్స్ గ్రూప్‌కు సంబంధించి ద్రవిడియన్ యూనివర్సిటీ విద్యార్థుల బృందం ప్రథమ బహుమతి, శాలిని అండ్ గ్రూప్‌కు ద్వితీయ, వివెం మౌనిక అండ్ గ్రూప్‌కు తృతీయ బహుమతి లభించాయి. అలాగే ఫోక్ సాంగ్ గ్రూప్‌కు సంబంధించి సి.కుసుమ అండ్ గ్రూప్‌కు ప్రథమ, జి.జాహ్నవి అండ్ గ్రూప్‌కు ద్వితీయ బహుమతులు లభించగా, నుక్కడ్ నాటక్(వీధి నాటకం)కు సంబంధించి హరిప్రసాద్‌కు ప్రథమ బహుమతి, పెయింటింగ్‌లో ఎన్.దుర్గాశ్రీకి ప్రథమ, ఎస్.కృతికకు ద్వితీయ బహుమతి, కవితా రచనలో జి.హాసిక, ఓఎస్ అలేఖ్యలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు లభించాయి.

## అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం



శాంతిపురం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, కార్మిక బోర్డు సభ్యుడు విశ్వనాథనాయుడు కోరారు. బుధవారం సొన్నేగానిపల్లి, మఠం,దండికుప్పం పంచాయతీల్లో జరిగిన పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీలో గ్రూపు రాజకీయాలు పక్కన పెట్టాలని అధిష్టానం ఆదేశాలతో ప్రతి ఒక్కరూ కలసికట్టుగా పనిచేయాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాలు ప్రజలకు తెలపాలన్నారు. మంగళవారం జరిగిన ఎస్ఎంసి ఎన్నికల్లో సమన్వయంతో పనిచేసి ఛైర్మన్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. సమావేశంలో నేతలు మణి, చంద్ర, గిరిధర్, బాలు, రాజేంద్ర, నాగరాజు, ఉమాపతి, గోపాల్, అనసూయ, బసవరాజు, చలపతి, వేదశ్రీ, హేమ, మంజునాథ్ గౌడ్, జనార్ధనరెడ్డి, శివానంద, మునేగౌడు, మంజునాథరెడ్డి, బాలమురుగన్ పాల్గొన్నారు.

## బహిరంగమద్యంసేవించిన వారికి జరిమానా



శాంతిపురం,సెప్టెంబర్ 30 ప్రభాతవార్త మండలంలో వివిధ చోట్ల బహిరంగ ప్రాంతాల్లో మద్యం సేవిస్తున్న 16మందిని కుప్పం కోర్టులో హాజరుపరచినట్లు రాళ్లబూదుగూరు ఎస్సై నరేష్ తెలిపారు. వీరికి న్యాయమూర్తి వెయ్యి రూపాయల జరిమానా విధించారన్నారు. మండలంలో ఎవరూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని ఎస్సై హెచ్చరించారు. డ్రోన్ కెమెరాల సాయంతో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బహిరంగ మద్యపానంను అరికట్టేందుకు డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా కొనసాగిస్తామన్నారు.

## రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయం
### - ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు



రామకుప్పం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయం అని ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కెంచనబల్ల రైతు సేవా కేంద్రంలో రైతులకు రాయితీతో ఉలవ విత్తనాల పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను ఆదుకునేందుకు సిఎం చంద్రబాబునాయుడు వ్యవసాయ రంగంలో ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారనా న్నరు. రైతులు కూడా ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నేతలు ఆనందరెడ్డి, పత్ర నారాయణ, చిన్నికృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, సత్తి, గుణశేఖర్, ఎఒ అమృత, రైతులు పాల్గొన్నారు.

## గ్రామ రెవెన్యూ సహాయకుల నిరసన

**రామకుప్పం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త** తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ రెవెన్యూ సహాయకులు బుధవారం నిరసన, నిరవధిక సమ్మెకు దిగారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత కలిగిన విఆర్ఎలకు పదోన్నతులు కల్పించాలన్నారు. నామినీలను రెగ్యులర్ విఆర్ఎలుగా గుర్తించాలన్నారు. ప్రమోషన్ కేటాయి ంపు డెబ్బై ్రశాతానికి పె ంచాలన్నారు. కార్యక్రమంలో విఆర్ఎలు రమణ, శివప్ప, శ్రీనివాసులు, ముకుంద పాల్గొన్నారు.

## ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించరాదు



రామకుప్పం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త రామకుప్పం పట్టణ ప్రధాన రహదారిలో వాహనదారులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించరాదని ఎస్సై మారెప్ప సూచించారు. బుధవారం రామకుప్పంలో ఆయన వాహనదారులకు పలు సూచనలు చేశారు. ప్రతి వాహనం రోడ్డుకు దూరంలో నిలపాలన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు, పెద్ద వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగించరాదన్నారు.

## రైతులకు రాయితీ ఉలవలు పంపిణీ




వి.కోట, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త ప్రభుత్వం రైతులకు రాయితీతో అందిస్తున్న ఉలవ విత్తనాల పంపిణీని టిడిపి మండల అధ్యక్షుడు రాంబాబు ప్రారంభించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద జరిగిన ఈకార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేని పరిస్థితుల్లో రైతులు ప్రత్యామ్నాయ పంటలసాగుపై మక్కువ చూపాలన్నారు. త్వరలోనే తోతాపురి రైతులకు రూ4వంతున ప్రోత్సాహకంను ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ ఛైర్మన్ నారాయణస్వామి, డైరెక్టర్లు ధీరజ్, చంద్రారెడ్డి, ఎఒ అప్పోజి పాల్గొన్నారు.

## పిడిఒల సంక్షేమం అభివృద్ధిమండలి నూతన కార్యవర్గం



వి.కోట,సెప్టెంబర్ 30 ప్రభాతవార్త వి.కోట మండల పంచాయతీ అభివృద్ధి అధికారుల సంక్షేమం, అభివృద్ధి మండలి నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా భాస్కర్, అధ్యక్షుడిగా శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా మునీశ్వరి, భాస్కర్, శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా ఉమాపతి, కోశాధికారిగా నరేష్, జాయింట్ కార్యదర్శులుగా త్రివేణి, సంజీవరెడ్డి, సురేష్, గౌరవ సలహాదారులుగా రేహానాబాను, సోమశేఖర్‌తో పాటు కార్యదర్శ సభ్యులుగా మహేష్, మౌని, కృష్ణ, అరుణ, కిరణ్‌కుమార్, బాబురెడ్డి, సోమశేఖర్‌రెడ్డిలను ఎన్నుకున్నారు.

## ఎమ్మెల్యేచే 4కోట్లతో రోడ్ల నిర్మాణంకు భూమిపూజ



బైరెడ్డిపల్లి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త మండలంలోని కైగల్ -శనిపల్లి వయా రామసము ద్రం వరకు నూతనంగా నాలుగు కోట్లతో నిర్మించే రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే అమరనా థ్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక ఏళ్లుగా ఈరోడ్డు పని పెండింగ్‌లో ఉండడంతో వెంటనే ప్రారంభించామన్నారు. రెండు నెలల్లో పనులు పూర్తయ్యేలా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు కిషోర్ గౌడ్, తహశీల్దార్ ప్రసన్నకుమార్, ఎంపిడిఒ ఆనంద్‌బాబు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## పల్లెపండుగ 3.0తో గ్రామాలకు మహర్దశ
### - ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు



**చిత్తూరు, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** రాష్ట్రంలో గ్రామాల రూపు రేఖలు మార్చడానికి కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పల్లె పండుగ 3.0 విప్లవాత్మకమైన మార్పులకు నాంది పలుకుతుందని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పల్లెల్లో రోడ్లు దెబ్బతిని, డ్రైనేజీ వ్యవస్థలు లేక అస్తవ్యస్థంగా మారిన గ్రామాలను మళ్ళీ ప్రగతి పథంలో నడిపించడానికి ఈ కార్యక్రమం పని చేస్తోందన్నారు. చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఈ కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామానికి లబ్ది చేకూరనుందన్నారు. మన పల్లెల్లో మౌళిక వసతులు కల్పించడంతో పాటు, ఉపాధి హామీ పథకంను అనుసంధానం చేయడం ద్వారా కూలీలకు పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తుందన్నారు. అలాగే పాడి రైతులకు మినీ గోకులాలు ఏర్పాటు, ఉద్యానవనాల అభివృద్ధి ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం కానుందన్నారు. చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలందరు భాగస్వాములై పల్లె పండుగ అభివృద్ధి పనులను నాణ్యతతో నిర్ధేశిత గడువులోపు పూర్తి చేసేలా పర్యవేక్షించాలన్నారు.

## సోయాబీన్ సాగుతో అధిక దిగుబడి

పెనుమూరు, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త: మండల పరిధిలో సోయాబీన్ పంట సాగు పట్ల రైతులు ఆసక్తి చూపాలని మండల వ్యవసాయ అధికారి స్వర్ణలత సూచించారు. మండలంలోని గొడుగుమానిపల్లిలో బుధవారం ఓ రైతు పండించిన సోయాబీన్ పంటను శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. సోయాబీన్ పంట సాగు, ఖర్చు, బెట్ట పరిస్థితులను తట్టుకునే మెళకువలను శాస్త్రవేత్తలు ఈ సందర్భంగా రైతులకు వివరించారు. పూత, పిందె రాలడం ఆరికట్టడానికి పోటాషియం నైట్రేట్ లేదా మల్టీకే ఐదు మిల్లీ లీటర్ల నీటిని పిచికారి చేసుకోవాలని సూచించారు. రైతులు సోయాబీన్ పంట సాగు పట్ల ఆసక్తి చూసి సాగు చేపడితే రైతులు అధిక లాభాలు ఆర్జించే అవకావాలు వున్నాయన్నారు. ఈ పంట సాగు చేయడం ద్వారా రైతుల అధిక దిగుబడి సాధించినట్లైతే రైతులు ఆర్థికంగా నిలదొక్కుకుంటారన్నారు.

## డీ అడిక్షన్ సెంటర్ తనిఖీ




చిత్తూరుహెల్త్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త: ఆపరేషన్ గరుడలో భాగంగా బుధవారం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని డీ-అడక్షన్ సెంటర్‌ను పోలీసు అధికారులు, డ్రగ్ ఇన్స్‌పెక్టర్, ఈగల్ టీమ్ సభ్యులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీ అడిక్షన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న ఏడు మంది మద్యం వ్యసనదారులతో ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ మద్యం, ఇతర మాదకద్రవ్యాల వల్ల కలిగే ఆరోగ్య, కుటుంబ, సామాజిక దుష్ప్రభావాలను వివరించారు. వ్యసనానికి దూరంగా వుండి ఆరోగ్యకరమైన జీవితంను కొనసాగించాలని వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాల్లో వున్న మెడికల్ షాపుల్లో డ్రగ్ ఇన్స్‌పెక్టర్ కీర్తన, ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్, టుటౌన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య, ఈగల్ టీమ్ సభ్యులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నార్కోటిక్ డ్రగ్స్ కొనుగోలు, విక్రయాలు, నిల్వ, సరఫరా, వాటి వినియోగానికి సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మెడికల్ షాపుల్లో నిర్వహిస్తున్న రికార్డులు, మందుల విక్రయాలను పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా నార్కోటిక్ డ్రగ్స్ విక్రయాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని షాపు యాజమానులను హెచ్చరించారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి రూ.40 వేలు జరిమానా

చిత్తూరు, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త: చిత్తూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన నలుగురు ద్విచక్ర వాహనదారులకు బుధవారం ఫస్ట్ స్పెషల్ జ్యుడిషియల్, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ పరిమళ దేవి ఒకొక్కరికి రూ.10 వేలు చొప్పున 40 వేల రూపాయలు జరిమానా విధించారు. ఈ మేరకు ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నరసింహరాజు వివరాలు వెల్లడిస్తూ మంగళవారం ట్రాఫిక్ పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్న సందర్భంగా చిత్తూరు నగర పరిధిలో నలుగురు ద్విచక్ర వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారన్నారు. వీరిని బుధవారం కోర్టు ఎదుట హాజరు పరిస్తే కేసుపూర్వపరాలను పరిశీలించిన జడ్జి పరిమళదేవి ఒకొక్కరికి రూ.10 వేలు జరిమానా విధిం చారన్నారు.

## పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యత
### - ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు



**చిత్తూరు, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** నగర పరిధిలో మెరుగైన పారిశుధ్యం, ప్రజల ఆరోగ్యం కోసం నిత్యం శ్రమిస్తున్న నగర పాలక సంస్థ పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా-2026 కార్యక్రమంలో భాగంగా బుధవారం నగర పాలకసంస్థ కార్యాయలంలో పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరంను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగర పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో వుందన్నారు. కార్మికుల శ్రమని తగ్గించి సులభంగా పనులు చేసేలా ఆధునిక పనిముట్లను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్మికులు పని చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కమీషనర్ నరసింహప్రసాద్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛతా మీ ప్రతిజ్ఞ చేశారు. అలాగే ఉత్తమ సేవలు అందించిన ఇద్దరు పారిశుధ్య కార్మికులను శాలువలతో సత్కరించారు. పారిశుధ్య పనుల నిర్వహణకు సంబంధించి పిపిఇ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ కమీషనర్ అమినేని ప్రసాద్, ఎంహెచ్‌ఓ డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ త్యాగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో నేడు (గురువారం)

**పగలు : అభిషేకం ,రాత్రి : పూలంగిసేవ**

ఉభయదారులు : కీ॥శే॥ రాజమాణిక్యం నాయుడు అండ్ సన్స్, వేలూరు,శ్రీ కె.రాధాకృష్ణన్, కాణిపాకం. స్థానిక ఆస్థాన మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు: ఉదయం 10 గంటల నుండి అర్థరాత్రి 1 గంటల వరకు రాష్ట్రంలోని ప్రముఖ కళాకారులచే ధార్మికోపాన్యాసము, భక్తిగీతాలు,హరికథలు, కూచిపూడి, భరతనాట్యం, సురభి వారిచే పౌరాణిక నాటకం, గ్రామోత్సవం ప్రారంభమైనప్పటి నుండి పలు బృందాలచే విచిత్ర వేషధారణలు, కోలాటాలు, చెక్కభజనలు.

## పారిశుద్ధ్య కార్మికులకు సంజీవని వైద్య శిబిరం



శాంతిపురం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త మండలంలోని అన్ని గ్రామ పంచా యతీ ల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికు లకు బుధవారం శాంతిపురంలో సంజీవని పథ కంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిం చా రు. ఈసందర్భంగా వైద్యులు పారిశుధ్య కారి ్మకులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, మాత్రలు పంపిణీ చేశారు. సంజీవని పథకంలో కాల్ సెంటర్ సౌకర్యం సైతం సద్వినియోగం చేసుకునే అవకాశం ఉందన్నారు. కార్మికుల ఆరోగ్యం కోసం ఈ శిబిరం ఏర్పాటుచేశామన్నారు. కార్యక్రమంలో పిహెచ్‌సి డాక్టర్ ప్రసాద్, ఉప ఎంపిడిఒ రవి నాయక్, ఎపిఎం శ్రీనివాసులు, ఎపిఒ చిన్నరెడ్డెమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు పంపిణీ



**కుప్పం సెప్టెంబర్ 30 ప్రభాతవార్త.** మండలంలోని గౌడప్పనూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు వెంకటస్వామి ఇట ీవల మృతి చెందారు. ఈయనకు ప్రమాద బీమా ఉండడంతో పార్టీ తరఫున సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ 5 లక్షల రూపా యలను మంజూరు చేశారు .ఈ చెక్కును బుధ వారం టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, కార్పొరేషన్ డైరెక్టర్ మణి, తెలుగు అధ్యక్షుడు కనకరాజ్ బాధిత కుటుంబానికి పంపిణీ చేశారు. స్థానిక నాయకులు బీరప్ప, తిమ్మప్ప, వెంకటాచలం, గోపి ,చంద్రప్ప ,గణపతి, రమేష్ పాల్గొన్నారు.

## యువజనోత్సవ పోటీలకు ద్రవిడ విద్యార్థులు



**కుప్పం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త.** జిల్లాస్థాయి యువజనో త్సవ పోటీలకు ద్రవిడ వర్సిటీకి చెందిన 18 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరు జానపద ఆట, జానపద పాట, పెయింటింగ్, కవిత రచన విభాగాల్లో జరిగే పోటీల్లో పాల్గొంటారు .ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య ఎం సి మల్లయ్య విద్యార్థులను అభినందించారు. వర్సిటీకి మంచి పేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార కిరణ్ కుమార్, అకాడమిక్ డీన్ ఆచార్య శ్యామల, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ హర్షవర్ధన్, ఫైనాన్స్ అధికారి పలని, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ వరదరాజులు, స్టూడెంట్ కౌన్సిల్ అధ్యక్షుడు ఓబన్న పాల్గొన్నారు .

## రైతులకు రాయితీ ఉలవలు పంపిణీ

కుప్పం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త మండలంలోని వి మిట్టపల్లి పంచాయతీ కేంద్రంలో ప్రభుత్వం రైతులకు 80 రాయితీతో అందిస్తున్న ఉలవల పంపిణీ కార్యక్రమాన్ని క్లస్టర్ ఇన్‌చార్జ్ హైదర్ వలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకు 10 కిలోల ఉలవల విత్తనాలను రూ 148 లకు అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు చలపతి, స్థానిక రైతులు పాల్గొన్నారు. ఫోటో రైట్ అప్ :కెపిఎం 3

## మున్సిపల్ ఎన్నికల్లో ఘనవిజయమే లక్ష్యంగా పనిచేద్దాం రెస్కో ఛైర్మన్ ప్రతాప్ కుమార్.



కుప్పం ,సెప్టెంబర్ 30 ప్రభాతవార్త త్వరలో జరగనున్న కుప్పం మున్సిపాలిటీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల ఘనవిజయమే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పని చేద్దామని రెస్కో ఛైర్మన్ ప్రతాప్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం మున్సిపల్ పరిధి అని మిగానిపల్లిలో జరిగిన పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేసి అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ప్రజలకు చేస్తున్న మంచిని ఇంటింటా తిరిగి ప్రజలకు తెలియజేయవలసిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పార్టీ కోసం పనిచేయాలని ఆయన కోరారు. సమావేశంలో కడ సభ్యుడు రాజ్ కుమార్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్ ,ఏరియా ఆసుపత్రి వైస్ ఛైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్, రెస్కో డైరెక్టర్ ఆర్ముగం ,మాజీ ఏఎంసీ ఛైర్మన్ సత్యేంద్ర శేఖర్, క్లస్టర్ ఇన్చార్జ్ రోహిత్, స్థానిక నాయకులు పాల్గొన్నారు .

## జాతీయస్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో కస్తూరికి బంగారు పతకం.

**కుప్పం ,సెప్టెంబర్ 30 ప్రభాతవార్త** మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీ నగర్ లోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ యూనివర్సిటీ స్పోర్ట్స్ క్యాంపస్ లో జరిగిన జాతీయస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ ఛాంపియన్‌షిప్పోటీల్లో గుడిపల్లి మండలం సోడిగానిపల్లి జడ్పీ హైస్కూల్లో చదువుతున్న కస్తూరి బంగారు పతకాన్ని సాధించింది. రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించిన కస్తూరి జాతీయ స్థాయిలోనూ సత్తా చాటింది. ఈమె తల్లిదండ్రులు సుబ్రహ్మణ్యం రేణుకమ్మ తమ కుమార్తెను సాఫ్ట్ బాల్ రంగంలో ప్రోత్సహిస్తున్నారు. జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించిన కస్తూరిని స్థానికులు అభినందించారు. ఫోటో రైట్ అప్ : కె పి యం 6

## మున్సిపల్ సిబ్బందికి ఉచిత మెగా వైద్య శిబిరం



కుప్పం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త. కుప్పం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కుప్పం మున్సిపాలిటీలో పనిచేస్తున్న సిబ్బంది, ఉద్యోగులకు బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆయుష్, కుప్పం పి ఈఎస్ వైద్య కళాశాల సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. దాదాపు 100 మందికి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉచితంగా ఈసీజీ పరీక్షలు సైతం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ శిబిరం నిర్వహించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జిమ్ దాము, సోమశేఖర్ ,ఎంఆర్ సురేష్, లయన్స్ క్లబ్ సలహాదారు మహేష్, అధ్యక్షుడు సెల్వం, ఏకాంబరం ,సిబ్బంది పాల్గొన్నారు.

## మద్యం దుకాణం దరఖాస్తులకు నేడు చివరి రోజు ఎక్సైజ్ సి ఐ నాగరాజ.

కుప్పం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త. కుప్పం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని శాంతిపురం మండలంలో మద్యం షాపు ఏర్పాటుకు సంబంధించి దర ఖాస్తులకు గురువారం చివరి రోజు అని కుప్పం ఎక్సైజ్ సీఐ నాగరాజ తెలిపారు. ఆసక్తి గలవారు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. తిరిగి మూడు లక్షల రూపాయలకు చలానా కట్టిదరఖాస్తుచేసుకోవాలనిసూచించారు.మరిన్నివివరాలకు కుప్పం ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

## స్థానిక ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయాలి ఆర్టిసి వైస్ ఛైర్మన్ పిఎస్ముని రత్నం.

రామకుప్పం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ ముని రత్నం, పిలుపు పి కే యం యుడా ఛైర్మన్ డాక్టర్ బి.ఆర్ సురేష్ బాబు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని చిక్కపల్లి తండా, రామకుప్పం పంచాయతీలో తెలుగుదేశం పార్టీ సర్వసభ్య సమావేశాలకు వారు హాజరై ప్రసంగించారు. పార్టీ శ్రేణులు ఐకమత్యంగా, సమన్వయంతో పనిచేసి స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని సూచించారు. సీఎం చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి ప్రజల్లో మరింత చైతన్యం కలిగించాలని సూచించారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి నాయకులు కృషి చేయాలని సూచించారు సమావేశంలో సిప్ప పిఎ శ్రీకాంత్, నాయకులు మునస్వామి, పత్ర నారాయణ, వెంకటరమణ, ఆనంద రెడ్డి, కామరాజు నాయక్, ఆంజనేయ రెడ్డి, సీతాపతి, నరసింహులు ,చిన్ని కృష్ణ , విశ్వనాథ్ ,రఫీ తదితరులు పాల్గొన్నారు. ఫోటో

## కాణిపాకంలో హోరెత్తించిన సాంస్కృతికం








కాణిపాకం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం జరిగిన కల్పవృక్షవాహనసేవ సందర ్భంగా ఏర్పాటు చేసిన వైవిధ్యభరితమైన సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలతో కాణిపాకం హోరెత్తింది. ఈసందర్భంగా దేవస్థానం, ఉభయదారుల సంయుక్త ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రఖ్యాత కళాకారులతో పలు రకాల సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈకార్యక్రమాలు భక్తులను రంజింపజేశాయి. ముఖ్యంగా కల్పవృక్షవాహనసేవ గామోత్సవం ప్రారంభమైనప్పటి నుండి ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దీనితో పాటు స్థానిక ఆస్థానమండపంలో ఉదయం నుండి రాత్రి వరకు భక్తి సంగీత కచ్చేరి, కూచిపూడి, భరతనాట్యం, లంబాడి నృత్యాలు, కోలాటాలు, చెక్కభజనలు తదితర కార్యమ్రాలను నిర ్వహించారు. అలాగే అష్టోత్తర శత కలశాల ఊరేగింపు, గ్రామోత్సవం సందర్భంగా ప్రదర్శించిన కేరళవాయిద్యాలు, తప్పిటగుళ్ళు, విచిత్రవేషధారణలు, ప్రత్యేక కళాకారులచే ఏర్పాటు చేసిన కోలాటాలు, పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# కమనీయం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణం

**- కల్యాణోత్సవంలో ఒక్కటైన పలు జంటలు**





చిట్టమూరు, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : చిట్టమూరు మండలం మల్లాంలోని వళ్ళీ, దేవసేనా సమేత స్వయంభువు శ్రీ సుబ్రహ్మ ణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ కామిరెడ్డి మునిశేఖం రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఉత్సవమూర్తులకు ప్రత్యేక పుష్పాలంకరణ, విశేష పూజలు నిర్వహించి, ఆలయ ఆవరణలోని నూతన కల్యాణ మండపంలో స్వామివారిని కొలువుదీర్చి కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవ సందర్భంగా అర్చకులు స్వామివారి కల్యాణ విశిష్టతను, కల్యాణోత్సవ ప్రక్రియను భక్తులకు వివరిస్తూ చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. మల్లాం పరిసర ప్రాంతాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొని దర్శించుకున్నారు. స్వామి ఆలయంలో కల్యాణోత్సవం సందర్భంగా వివాహాలు జరుపుకోవడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ సంప్రదాయంలో భాగంగా బుధవారం కూడా పలు జంటలు ఒక్కటయ్యారు. కల్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. భక్తుల రాకతోఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు వసతులు కల్పించి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కరణం కాలప్ప పిళ్లై, మోహనమ్మ, కరణం వెంకటాచలం, శకుంతలమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కల్యాణోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చిట్టమూరు ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉత్సవం ప్రశాంతంగా కొనసాగేందుకు పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.

# వరసిద్ధునికి వైభవంగా అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకం

**-కిక్కిరిసిన భక్తజనం**





కాణిపాకం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం జరిగిన కల్పవృక్షవాహనసేవ సందర్భంగా ఉభయ దారులచే స్వామివారికి అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకను ఘనంగా నిర్వహించారు. ఈమేరకు ఉభయదారులైన దేవస్థానం కార్యనిర్వహణాధికారి, అర్చకులు మరియు ఆలయ సిబ్బంది స్వామివారికి అష్టోత్తర శత కలశ క్షీరాబిషేకను నిర్వహించారు. ఈమేరకు ఆలయ ఈఓ పెంచల కిషోర్,ఆలయ చైర్మన్ మణినాయుడు, సిబ్బంది వారి కుటుంబ సభ్యులు వందలాది మంది మంగళవాయిద్యాలు, కేరళవాయిద్యాలు,తప్పెట గుళ్ళు, కోలాటాలు వంటి ప్రత్యేక వైవిధ్యభరితమైన సాంస్కతిక ప్రదర్శనల నడుమ మణికంఠేశ్వ రాలయం నుండి అష్టోత్తర శత కలశాలను గ్రామపురవీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం ఆలయంలో అర్చకులు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వుంచి అష్టోత్తర శత కలశాలలోని పాలతో ఘనంగా అభిషేకించారు. అలాగే పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకించి చతుర్వేద పారాయణం గావించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకరించి ప్రత్యేక పూజలు చేసి ధూపదీపనైవేద్యాలను సమర్పించారు. అనంతరం వేదపండితులు మంత్రపుష్పం గావించారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ మణినాయుడు,ఈఓ పెంచల కిషోర్, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, స్థానాచార్యులు పణికుమార్ శర్మ, ఏఈఓలు ధనపాల్, హరిమాధవరెడ్డి, రవీంద్రబాబు,ప్రసాద్, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్ పెక్టర్‌లు బాలాజినాయుడు,రవిలతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు,అర్చకులు, వేదపండితులు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

# జీవ వైవిధ్యం లేకపోతే మానవ మనుగడ అసాధ్యం

**- నేషనల్ బయోడైవర్సిటీ డైరెక్టర్ చెరుకూరి వెంకటేశ్వర ప్రసాద్**



తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త: ప్రకృతిలో జీవవైవిద్యం లేకపోతే మానవ మనుగడ అసాధ్యం, ప్రశ్నార్థకంగా మారుతుందని అమర హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గౌరినేని రమాదేవి పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం,విద్యార్థి సంక్షేమ, సాంస్కృతిక వ్యవహారాల విభాగం ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని శేషాచలం జీవ వైవిధ్య సజీవ వారసత్వం అనే అంశంపై వారం రోజుల అవగాహన,సృజనాత్మక కార్యక్రమం బుధవారం శ్రీనివాస ఆడిటోరియంలో జీవ వైవిధ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అమర హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గౌరినేని రమాదేవి, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, నేషనల్ బయోడైవర్సిటీ డైరెక్టర్ చెరుకూరి వెంకటేశ్వర ప్రసాద్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గౌరినేని రమాదేవి మాట్లాడుతూ ప్రకృతి నియమాలకు ప్రకారంగా అడవులను సంరక్షిస్తూ వాటిలోని విశిష్ట సంపదను కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందని సూచించారు. ప్రకృతిని నాశనం చేయడం ద్వారా జీవవైవిద్యం అసమతుల్యం వలన మానవ మనుగడకే ప్రమాదంగా మారే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ అధ్యాపకులు, విద్యార్థులు సమాజంలోని అన్ని వర్గాలకు పకృతి వైవిధ్యం, జీవవైవిద్యం, పరిసరాలు వాటి ఆవశ్యకత గురించి సమగ్రంగా వివరించవలసిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు.జీవవైవిద్యం అసమతౌల్యం ఏర్పడితే మానవ మనుగడ అసాధ్యమని హెచ్చరించారు. నేషనల్ బయోడైవర్సిటీ డైరెక్టర్ చెరుకూరి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ జియో వైవిధ్యం పై విద్యార్థులకు ఆహ్వాన కల్పించడం మనందరి బాధ్యత అని అన్నారు. వర్సిటీ రెక్టర్ ఆచార్య చంద్రాయుడు,రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడులు మాట్లాడుతూ విద్యార్థులకు వారం రోజుల పాటు జీవ వైవిద్యంపై అవగాహన, వకృత్వ, పెయింటింగ్ పోటీలు నిర్వహించడం ద్వారా వర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టరేట్ చేపడుతున్న కార్యక్రమాలను పట్ల అభినందనలు వ్యక్తం చేశారు.

## సర్‌కు వ్యతిరేకంగా ఉద్యమం : కాంగ్రెస్ నేతలు




తిరుపతి,సెప్టెంబర్ 30ప్రభాతవార్త: సర్ కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమం తీవ్రతరం చేస్తామని కాంగ్రెస్ పార్టీ నేతలు హెచ్చరించారు. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, వామపక్షాలు ఇతర ప్రతిపక్ష పార్టీలు పార్లమెంట్‌లో జ్ఞానేష్ కుమార్‌పై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టేందుకు నోటీసులు కూడా ఇచ్చాయన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరించారని ఆయన తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ తిరుపతి అర్బన్ జిల్లా అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు డిమాండ్ చేశారు. బుధవారం తిరుపతి లోని వివేకానంద విగ్రహం వద్ద నుండి నగరపాలక సంస్థ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పిఎం మోడి, సీఈసీ జ్ఞానేష్ కుమార్ ల దిష్టిబొమ్మలను ఊరేగింపు గా కార్పొరేషన్ కార్యాలయం వద్దకు తీసుకువెళ్లారు. వాటిని దగ్ధం చేయడానికి సిద్ధమవడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. పార్టీ జెండాలను చేతపట్టుకుని సిఈసి కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ తిరుపతి అర్బన్ జిల్లా అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు మాట్లాడుతూ భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగ కల్పించిన హక్కని చెప్పారు. కేంద్రంలో అధికారంలో బీజేపీ కొనసాగడానికి సీఈసీ సంపూర్ణంగా సహకరిస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోందని అన్నారు. ఒక్కో రాష్ట్రంలో లక్షల సంఖ్యలో ఓటర్లను అనర్హులుగా ప్రకటించడమే ఇందుకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాంగాటి గోపాల్ రెడ్డి ,నాయకులు చిత్తూరు శివశంకర్ ,నన్నేఖాన్, శివ బాలాజీ, రఫీక్, కుమరగిరి ధనంజయ్, తవన్ కళ్యాణ్, జావేద్, గౌతమ్, వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

## సత్వరం ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలి!

**చిత్తూరులో ఎలక్షన్ కమిషన్ మృతదేహంను ఊరేగించిన కాంగ్రెస్ నాయకులు**

చిత్తూరు. సెప్టెంబర్30 ప్రభాతవార్త : దేశంలో భారీగా ఓట్లను తొలగించి ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడిన భారత ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్



కుమార్ సత్వరం రాజీనామా చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రమేష్ బాబు. చిత్తూరు నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టిక్కీ రాయల్ డిమాండ్ చేశారు. దేశంలో భారీగా ఓట్లు తొలగింపు పై ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు చిత్తూరులో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్ బాబు, చిత్తూరు నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు టిక్కీ రాయల్ లు మాట్లాడుతూ దేశంలో 13 కోట్ల ఓట్లను ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తొలగించారని అలాగే 1.5 కోట్ల ఓట్ల తొలగింపుకు నోటీసులు జారీ చేశారని ధ్వజమెత్తారు. ఓటర్ల జాబితా నుండి అర్హులైన ఓటర్లను ఎలక్షన్ కమిషనర్ తొలగించడంతో ఎన్నికల్లో గెలవాల్సిన అభ్యర్థులు ఓడిపోయారు అన్నారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ మేనేజ్ కుమార్ రాజ్యాంగాన్ని అపహాస్యం చేశారని గజమెత్తారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఎలక్షన్ కమిషనర్ మృతదేహం దిష్టిబొమ్మను ఊరేగించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్న చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణం రాజీనామా చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శులు గణేష్ కుమార్ యాదవ్, పాలక్ వర్మలు, కాంగ్రెస్ నాయకులు ఆవుల గోపి, సెల్వం, ప్రభాకర్, పూర్ణ, అక్బర్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్లు, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**కళ్యాణ వెంకన్న ఆశీస్సులతో ..**

## స్వామి వారికి సింహ, గజ వాహనాలు వితరణ



చంద్రగిరి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త: శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి పరిపూర్ణ ఆశీస్సులతో స్వామివారికి సింహ వాహనం, గజ వాహనం వితరణ చేసినట్లు హైదరాబాద్, బంజార హిల్స్, నవోదయ కాలనీ, రోడ్ నెంబర్ 14కు చెందిన పి.వి.లక్ష్మీ రెడ్డి, పి.వి.దివ్య ప్రియాంక తెలిపారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారు బ్రహ్మోత్సవాల సమయంలో తిరుమాడ వీధులలో తన దేవేరులతో విహరించడానికి టిటిడి నిబంధనలను అనుసరించి రూ.40 లక్షల వ్యయంతో బంగారు తాపడంతో తయారు చేయించిన సింహ వాహనం, గజ వాహనంను బుధవారం ఆలయ ప్రధాన అర్చకులు బాలాజీ రంగకుమార్, నారాయణాచార్యులు ఆధ్వర్యంలోని అర్చక బృందం వేదమంత్రోచ్చారణల నడుమ దాతలు ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ పి.వరలక్ష్మి, ఏఈఓ యం.గోపినాథ్ దాతలకు దర్శన ఏర్పాట్లు గావించి, వేదాశీర్వాదం, స్వామి వారి శేష వస్త్రంతో ఘనంగా సన్మానించి, తీర్థప్రసాదాలను అందజేశారు. స్వామివారికి వాహనాలను అందించే భాగ్యం తమకు లభించడం పట్ల దాతలు అత్యంత సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ద్వారక మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనం పెంచాలని ఎంపీడీవోకి వినతి



నాగలాపురం, సెప్టెంబరు 30 ప్రభాతవార్త: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో గత 19 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించి, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆంధ్రప్రదేశ్ ఫీల్డ్ అసిస్టెంట్ జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం నాగలాపురం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి గుణశేఖర్‌కి వినతిపత్రం సమర్పించింది. ప్రస్తుతం ఫీల్డ్ అసిస్టెంట్లకు నెలకు రూ.5,745 మాత్రమే వేతనం అందుతోందని, దీంతో కుటుంబాలను పోషించుకోవడం తీవ్ర ఇబ్బందిగా మారిందని జేఏసీ ప్రతినిధులు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీపథకం అమల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, డివిజన్ స్థాయి బదిలీలు కాకుండా మండల స్థాయి బదిలీలు కల్పించాలని, అర్హత, అనుభవం కలిగిన వారికి పదోన్నతలు ఇవ్వాలని వారు కోరారు. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్లకు అక్రమ తొలగింపులు నివారించి ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మూడు నెలలు పూర్తి చేసిన వారికి ఎఫ్‌టీఈ వర్తింపచేయాలని, ఉపాధి సిబ్బందికి వర్తింపచేస్తున్న విధంగా ఫీల్డ్ అసిస్టెంట్లకు కూడా ఎఫ్‌టీఈ, వర్తింపచేయాలని మ్యాన్‌డేస్ విధానం ప్రకారం రూ.7,500ను రద్దు చేయాలని కోరారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు అంగవైకల్యం, మరణం సంభవించినప్పుడు కుటుంబాలకు తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని జేఏసీ ప్రతినిధులు కోరారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని వారు ఎంపీడీవోని కోరారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## ఎకో టూరిజంను అభివృద్ధి చేయాలి : ఎమ్మెల్యే నెలవల




సూళ్లూరుపేట, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త: నియోజకవర్గంలోని ఇరకం దీవి, పులికాట్ సరస్సులలో ఎకో టూరిజంను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ విజ్ఞప్తి చేశారు. బుధవారం తిరుపతిలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర 2047లో భాగంగా నిర్వహించిన ఎకనామిక్ రీజియన్ సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ ప్రాంతంలో బోటింగ్, రవాణా సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా అంతర్జాతీయ స్థాయిలోఎకో టూరిజం హబ్‌గా మార్చే అవకాశాలను పరిశీలించాలని ఆమె కోరారు. సూళ్లూరుపేట నియోజకవర్గ పరిధిలోని మాంబట్టు సెజ్, మేనకూరు సెజ్‌లలో కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు పెద్దపీట వేసి ఆకర్షించాలని సూచించారు. ఈ సెజ్‌లలో మౌలిక వసతులు మెరుగుపరిచి, స్థానిక నిరుద్యోగ యువతకు పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకంలో సూళ్లూరుపేట నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా, టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేయాలని కోరారు. పోర్టులు, జాతీయ రహదారులకు సమీపంలో ఉన్న సూళ్లూరుపేట, నాయుడుపేట ప్రాంతాలను ప్రధాన లాజిస్టిక్స్ కారిడార్‌గా తీర్చిదిద్దాలని ప్రతిపాదించారు. తిరుపతి ఎకానమిక్ రీజియన్ చైర్మన్ ముఖేష్ కుమార్ మీనా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్లానింగ్ విభాగం జాయింట్ సెక్రటరీ అనంత్ శంకర్, జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశం, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## చంద్రారెడ్డిని పరామర్శించిన శ్రీ సిటీ అధినేత



చిట్టమూరు, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త: మండలం ఆలేటిపాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు లింగారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని శ్రీసిటీ అధినేత రవి సన్నారెడ్డి బుధవారం పరామర్శించారు. కొంతకాలంగా అనారోగ్య కారణాలతో తన కుమారుడి వద్ద చెన్నైలో విశ్రాంతి తీసుకుంటున్న చంద్రారెడ్డిని రవి సన్నారెడ్డి కలుసుకుని ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చంద్రారెడ్డి త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో స్థానికంగా చురుకుగా ప్రజా కార్యక్రమాల్లో పాల్గొనాలని రవిసన్నారెడ్డి ఆకాంక్షించారు. ఈ చిట్టమూరు మండలం, ఆలేటిపాడు పరిసర గ్రామాలలోని నిరుద్యోగ యువతీ యువకులకు శ్రీ సిటీలో విరివిగా ఉద్యోగ అవకాశాలు కల్పించి ఆదుకోవాలని చంద్రారెడ్డి రవి సన్నారెడ్డిని కోరినట్లు తెలిపారు.

## మడిబిక్షాలతో ప్రారంభమైన పోలేరమ్మ జాతర



బాలాయపల్లి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త: గ్రామ శక్తి స్వరూపమే పోలేరమ్మ అమ్మవారి జాతర మడిబిక్షాలతో ప్రారంభమైంది. చిన్నారులు పోలేరమ్మకు బిక్షం పెట్టండి పోతురాజుకు టెంకాయ కొట్టండి మడి భక్షాలు ఎత్తారు. సాంప్రదాయపద్ధంగా పోలేరమ్మ జాతర ప్రారంభమైంది. జాతరకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తి స్థాయిలో ఏర్పాటు చేశారు. పోలేరమ్మ జాతరకు వచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉచిత వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేశారు. తాగునీటి సరఫరా చేయించారు. వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలపల్ల దేవాదాయ శాఖ ఈవో శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షణలో ఏర్పాటు చేశారు.

## మండల పరిషత్ ప్రత్యేక అధికారి బాధ్యతలు



తడ,సెప్టెంబరు 30 ప్రభాతవార్త: తడ మండలం ప్రజా పరిషత్ పాలకవర్గం పదవీకాలం సెప్టెంబర్ 23వ తేదీతో ముగిసింది మండల ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా భాను ప్రసాద్ బాధ్యతలు బుధవారం చేపట్టారు భాను ప్రకాష్ సూళ్లూరుపేట పశువర్ధకశాఖలో పనిచేస్తున్నారు అదనపు బాధ్యతగా మండల ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా నియమించారు. ఎంపీడీవో శేఖర్ వారి సిబ్బంది భాను ప్రసాద్‌ను ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి!

తడ,సెప్టెంబరు 30 ప్రభాతవార్త: తడ మండలం గ్రద్ద గుంట బీసీ కాలనీ సమీపంలో జాతీయ రహదారి పై బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి అక్కడికి అక్కడె మృతి చెందాడు బీసీ కాలనీలో నివాసం ఉంటున్న చంద్రయ్య (52) సంవత్సరాలు బుధవారం ఉదయం రోడ్డు దాటుతున్న క్రమంలో నెల్లూరు నుండి చెన్నై వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం చంద్రయ్యను వేగంగా ఢీకొట్టడంతో బలమైన గాయాలతో మృతి చెందాడు చంద్రయ్య కుమారుడు సాయి తేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తడ పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శిక్షణ ముగిసింది...ఉపాధి మొదలైంది !



తిరుపతి విద్య సెప్టెంబర్ 30 ప్రభాతవార్త: శిక్షణ తీసుకున్నారు.. నైపుణ్యం నేర్చుకున్నారు.. ఇక ఆ నైపుణ్యంతోనే సంపాదించేందుకు సిద్ధమయ్యారు. గోమయంతో వివిధ ఉత్పత్తుల తయారీపై శిక్షణ పొందిన 30 మంది మహిళలకు శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం ఆచరణాత్మకంగా ఉపాధి బాట చూపింది. శిక్షణ ముగిసిన రోజే పాకాల మండలంలోని తలారివారిపల్లి, అడుసుపల్లి గ్రామాల్లో రెండు గోమయ ఆధారిత ఉత్పత్తుల తయారీ కేంద్రాలను ప్రారంభించడం ద్వారా శిక్షణను ఉపాధితో అనుసంధానించింది.శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం, నిరంతర పశువైద్య విద్యా సమాచార కేంద్రం ఆధ్వర్యంలో, భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి-వ్యవసాయ నిర్వహణ జాతీయ అకాడమీ, హైదరాబాద్ సహకారంతో మహిళలకు ఈ నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒక్కో గ్రామంలో 15 మంది చొప్పున మొత్తం 30 మంది స్వయం సహాయక సంఘాల మహిళలు ఈ తయారీ కేంద్రాల ద్వారా గోమయ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసి విక్రయించుకోనున్నారు. దీంతో శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలు నేరుగా ఉత్పత్తి, విక్రయం, ఆదాయంగా మారే అవకాశం ఏర్పడింది.గోమయ ఉత్పత్తులు తయారు చేయడం మాత్రమే కాకుండా వాటికి మార్కెట్ ఎలా కల్పించుకోవాలి, వినియోగదారులను ఎలా చేరుకోవాలి, తవణంపల్లికి చెందిన విశ్వభారతి నేచురల్స్ సంస్థకు చెందిన వినోద్‌రెడ్డి, పులిచెర్లకు చెందిన సహజీవనం సంస్థకు చెందిన యువరాజ్ తమ వ్యాపార అనుభవాలను మహిళలతో పంచుకున్నారు. మహిళలు స్వయం ఉపాధి పొందడంతో పాటు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డా. బి. శోభామణి, భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి-వ్యవసాయ నిర్వహణ జాతీయ అకాడమీ, హైదరాబాద్ ప్రధాన శాస్త్రవేత్త డా. ఎం. బాలకృష్ణ తెలిపారు.కార్యక్రమంలో కార్యక్రమ సమన్వయకర్త డా. సుజాత, సమన్వయకర్తలు డా. ఎస్. శ్వేతకాంతి, డా. పి. మంజరి, డా. రెడ్డి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు అలిపిరి వద్ద కొబ్బరికాయలు కొట్టే కార్యక్రమం

**- టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు అత్తులూరు ఆనంద నాయుడు**



తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త: సుమారు 23 సంవత్సరాల క్రితం జరిగిన అలిపిరి బాంబు దాడి నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని రక్షించిన శ్రీ వెంకటేశ్వర స్వామి కృపకు కృతజ్ఞతగా మొక్కు తీర్చుకునే కార్యక్రమంలో భాగంగా నేడు ఉదయం 10 గంటలకు అలిపిరి పాదాల చెంత కొబ్బరికాయలు కొట్టే కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలుగుదేశం పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు అత్తులూరి ఆనంద నాయుడు పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమం అనంతరం ఉదయం 11 గంటలకు రుయా ఆసుపత్రి వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి టిడిపి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

